


# ఊసరవెల్లి

విజయలక్ష్మీ రామకృష్ణన్

నాగ్‌పూర్ ధంతోలీ ప్రాంతంతో పరిచయమున్నవారికి, అక్కడ కేవలం స్త్రీలకోసమే ఉద్దేశించిన హాస్టల్సు కొన్ని ఉండటం తెలిసిన విషయమే. వాటిలో ఒకటయిన 'ఆనందాశ్రమ్'లో, అంతాచేరి ఇరవై మంది ఉంటున్నారు.

హాస్టలు ఏ కాలేజికీ సంబంధించినదికాదు. ఒక హోటల్ మేనేజరు బాగా సంపాదించి క్రొత్తయిల్లు కట్టుకుని, తన పాతయింటిని ప్రత్యేకంగా స్త్రీలకు అద్దెకిచ్చాడు. అక్కడ ఉండేవాళ్లెవరూ వంటచేసుకోకూడదు. వసతికీ భోజనానికీ కలిపి నెలకు వందరూపాయలు కట్టాలి. భోజనాలు, కాఫీ, టీలు హోటల్‌నుండి రోజూ హాస్టల్ డైనింగుహాలుకి వస్తాయి. క్రింద మూడుగదులు, పైన మూడుగదులు వున్నాయి. విడిగా, ఒకహాలు, చిన్నగది. ముందు వసారాలో ఒక అవుట్ హవుస్ వుంది. దాంట్లో హోటలు యజమాని సవతితల్లి వుండేది పూర్వం. ఆవిడే వార్డెన్ బాధ్యతలు వహించేది. ఆమె అజమాయిషీ భరించలేని అమ్మాయిలు "ఆమె హాస్టల్ నుంచి వెళ్ళిపోతేనేగాని భోజనం చెయ్యమని దీక్షపూనారు. దాంతో ఆమె వెళ్ళిపోయింది.

పూర్వం, విద్యార్థినులంతా క్రిందిభాగంలోనూ, ఉద్యోగినులంతా పైభాగంలోనూ వుండేవారు. తర్వాత హోటల్ మేనేజరు

ఆలోచించి ఒక్కొక్క గదిలోనూ ఇద్దరు విద్యార్థినులూ ఒక్కొక్క ఉద్యోగినీ వుండే టట్లు, ముప్ఫయిఏళ్ళు దాటిన పెద్దమ్మా యిలు చదువుకునే అమ్మాయిల గురించి బాధ్యత వహించేట్లూ ఏర్పాటుచేశాడు. కాని యీ ఆనరరీ ఉద్యోగాలు ఎవరికీ నచ్చలేదు. చలికాలంరాత్రులు రజాయిల్లో వెచ్చదనం అనుభవించే స్టూడెంట్సును చూచి "పరీ క్షలు దగ్గరైనాయి. రాత్రి తొమ్మిదన్నా కాలేదు. లేచి స్వెట్టర్లు వేసుకుని చదవండి" అనడంకన్నా ఎక్కువ బాధ్యత ఉద్యోగి నులు వహించలేదు. చిన్నమ్మాయిల అబ్బాయి స్నేహితుల గురించి పెద్దమ్మాయి లకు పట్టేదికాదు. "అక్కడికి వాళ్ళు పాపాయిలూ - మేము ఆయాలు అయి నట్టు" అనుకునేవారు.

ఒక ఆదివారం ఉదయం, అప్పుడే నిద్రలేచి టూత్‌బ్రష్‌తోసహా బేసిన్ దగ్గర కెళ్ళిన భారతి "భారతీ! మీ పిన్ని వస్తున్న ట్టుంది చూడు!" అని ఎవరోవేసిన కేకకు త్రుళ్ళిపడి గబగబా ముఖం కడుక్కొని గౌనుబెల్టు బిగించుకుంటూ పక్కమీద పడున్న సినిమా పత్రికను దిండుక్రింద దాచి క్రిందకు పరిగెత్తింది. తెల్లవారే స్నానాదులు ముగించుకున్న ఏ యిద్దరి ముగ్గురికోతప్ప, ఏ అమ్మాయి ఒంటిమీదా చీరలేదు. అందరూ గౌనుల్లోనే వున్నారు. ఆ వేషంచూసి, వాళ్ళు చాలా నాగరికులని భ్రమపడవచ్చు; కాని అది నిజంకాదు. వాళ్ళంతా పుస్తకాలమధ్య దేవుడి ఫోటోలు పెట్టుకుని రోజూ అగరువత్తి వెలిగించి దణ్ణం పెట్టుకునేవాళ్ళూ, సోమవారాలు, శనివారాలు ఒంటిపూట చేసేవాళ్ళు, శకునం చూసుకుని పరీక్షల కెళ్ళేవాళ్ళు, పరీక్షలయ్యాక, కిలోనో, అరకిలోనో మిఠాయి పట్టుకుని గుడి కెళ్ళేవాళ్ళూ!

భారతి పినతల్లితో "ఏం పిన్నీ, తెల్లవారే వచ్చారు, నేను వచ్చేదాన్నిగా కాసేపట్లో'' అంది. భారతి ప్రతి ఆదివారం ప్రొద్దుట పినతల్లి యింటికెళ్ళి తలంటి




పోసుకుని భోంచేసి సాయంత్రానికి మళ్ళీ హస్టల్ చేరుకుంటుంది. భారతివాళ్ళ బాబాయి నాగపూర్ సెంట్రల్ హెల్త్ రిసర్చి ఇని స్టిట్యూట్‌లో ఇంజనీరు. వాళ్ళు సీతాబల్డీలో వుంటున్నారు. భారతి పినతల్లి శాంత, "అక్కయ్యకు ఒంట్లో బాగాలేదట. నిన్ను తీసుకుని రమ్మని బావగారు టెలిగ్రాం యిచ్చారు. పద బట్టలు సర్దుదాం" అంది. భారతి నివ్వెరపోయింది "సీరియస్‌గా లేక పోతే పరీక్షలముందు ఎందుకు రమ్మంటారు" అనుకున్నారంతా. వినత గబగబా స్టాండు మీద, దండెంమీద వున్న భారతి బట్టలుతీసి మడిచి ఆమెపెట్లో పెట్టి తాళంవేసి భారతి చేతికిచ్చింది. భారతి పినతల్లివెంట వెళ్తూ స్నేహితులతో "నేను పరీక్షలకు రాకపోతే, నా పుస్తకాలు పిన్నియింటికి పంపించండి" అంది. రుద్ధకంఠంతో. అమ్మాయిలంతా తప్పుచేసినట్లు బిక్కముఖాలు వేసుకుని వెళ్ళిపోయే భారతివంక చూస్తూ నిలబడి పోయారు.

ఆ సాయంత్రం ఎక్స్‌ప్రెస్‌లోనే భారతి, శాంత బయలుదేరి మర్నాటి ఉదయానికల్లా విజయవాడ చేరారు. స్టేషన్‌కు భారతి మేనమామ నాగభూషణం వచ్చారు. "అమ్మెట్లావుంది మామయ్యా", "అక్కయ్య కెట్లావుందన్నయ్యా" అని యిద్దరు ఒకసారే అడిగారు. నాగభూషణం నవ్వుతూ "కంగారేమి లేదర్రా. ఇంకా సేపట్లో చూస్తారుగా" అన్నారు. స్టేషన్ లోనే కాఫీలు ముగించుకుని బస్సుస్టాండు కెళ్ళారు. ఎక్స్‌ప్రెస్‌లో చోటు దొరికింది. విజయవాడలో బయలుదేరిన బస్సు ఉయ్యూరులోనే ఆగింది. దిగి రిక్షాల్లో యిల్లు చేరారు. చెప్పులన్నా విప్పకుండా తల్లి గదిలోకి పరిగెత్తింది భారతి. కూతుర్నీ, చెల్లెల్ని చూడగానే బావురుమంది దమ యంతి. భారతి "అమ్మా" అంటూతల్లిమీద ఒరిగిపోయి ఏడవడం మొదలుపెట్టింది. "ఏమిటక్కయ్యా, ఏం జరిగింది" అన్నది శాంత - అక్కచెయ్యి పట్టుకుని. నాగ భూషణం గదిలోకివచ్చి "నిన్నుచూసి మీ అమ్మ ఏడవడం, మీ అమ్మనుచూసి నువ్వే డవడమూనా, బాగుంది పిచ్చి, లే లే, లేచివెళ్ళి స్నానంచెయ్యి పో'' అని కేక లేశాడు మేనకోడలును.

దమయంతి వారం రోజులక్రిందట కళ్ళు తిరిగిన ట్లయి క్రిందపడిపోయింది. డాక్టరు వచ్చి చూసి బి. పి. ఎక్కువగా వుందని, గుండెకూడ కొంత బలహీనంగానే వుందని చెప్పాడు, నెలరోజులపాటు బెడ్ రెస్టు ఇమ్మన్నాడు. ఉప్పులేకుండా భోజనం పెట్టా లన్నాడు. (సర్పాసిల్ మాత్రలు, రాత్రిళ్ళు నిద్రరాకపోతే గార్డినాల్ యిమ్మన్నాడు.) ఎప్పుడూ జబ్బుపడి ఎరుగని దమయంతి

రుచీపచీలేని భోజనంతోటి బెంగతో భయపడిపోయింది. కళ్ళనీళ్ళతో భర్తతో "అమ్మాయి పెళ్ళిచూడకుండా నాకు చచ్చిపోవాలని లేదండీ," అంది. రఘురామయ్య నవ్వి "ఏమిటంత భయపడుతున్నావు? నెలరోజుల్లో లేచి మామూలుగా తిరుగుతావు. నువ్వుపడుకుంటే యీ యింట్లో పెళ్ళెట్లా జరుగుతుంది?" అన్నాడు. బైటకు వచ్చి బావమరిదిని పిల్చి "మీ చెల్లెలు కూతురి పెళ్ళికోసం బెంగపడుతోంది. సంబంధం చూడం డెక్కడయినా. వచ్చేనెల్లో భారతి పెళ్ళి చేసేద్దాం. కట్నం ఎక్కువయినా ఫరవాలేదు," అన్నాడు. నెలతిరిగే టప్పటికి నాగభూషణం భారతికి మెడ్రాసులో ఒక సంబంధం ఖాయంచేశాడు. రఘురామయ్య ఉత్తరం చూసుకున్న ధర్మారావు హైదరాబాదునుండి లగ్ననిశ్చయం నాటికి ఉయ్యూరు వచ్చాడు. ఆయన స్నేహితుణ్ణి చూసి బాధగా "పెళ్ళి చెయ్యకుండా చూడమంటినికదా, సరేనంటివికదా, మళ్ళా ఈ తతంగమంతా జరిపించడానికి నీకు మనసెట్లా ఒప్పింది?" అనడిగాడు. ధర్మారావు రఘురామయ్యకు ఆప్తమిత్రుడు. అతని ప్రోత్సాహము వల్లనే రఘురామయ్య కూతుర్ని కాలేజిలో చదివించాడు, యూనివర్సిటీ చదువుకు నాగపూర్ వెళ్తానంటే సరే నన్నాడు. ధర్మారావు మాటలకు రఘురామయ్య మనస్సు కలుక్కుమంది కాని ఆయన స్నేహితునికేమీ సంజాయిషీ యివ్వలేదు. స్నేహితుని మీద కన్న ఆయనకు భార్యమీద బాధ్యత, అపేక్ష, రెండూ ఎక్కువే! భారతి కళ్ళనీళ్ళతో "నాన్నా, నా చదువు మధ్యలో ఎట్లా ఆపడం?" అంది. రఘురామయ్య నవ్వుతూ "యం. ఏ. కూడా పెద్ద చదువటమ్మా, ప్రయివేటుగా పరీక్షకు వెళ్దువుగాని కావాలిస్తే, నీ పెళ్ళయితేనేకాని మీ అమ్మ లేచితిరగదు," అన్నాడు. భారతికి మాట్లాడేందుకింకేమీ మిగల్చలేదు.

దడదడలాడే హృదయంతో, బెదురు చూపులలో అత్తవారింట గృహప్రవేశం చేసింది భారతి. ఇరవైయేళ్ళు వచ్చినా పరీక్షల గొడవతప్ప పెళ్ళి ఆలోచనలు దగ్గరకు రానీయని భారతి మానసికంగా గృహిణి పదవికి సిద్ధపడలేదు హఠాత్తుగా హాస్టలు జీవితం, స్నేహితులు, పుస్తకాలు విడిచిపెట్టి, క్రొత్త ఊళ్ళో, క్రొత్తయింట్లో క్రొత్తవ్యక్తితో సహజీవనానికి భయపడింది. చదువుకున్నది కనుక, బాధ్యత లెరిగినది కనుక, నిండుమనసుతోనే అత్తవారింట అడుగుపెట్టింది తనేమిటో భర్తకు తెలియ చెప్పాలని, భర్తను అర్థం చేసుకోవాలని తహతహ లాడిపోయింది. భార్య అంటే చదవడానికి కొనుక్కున్న పుస్తకంలాగ తోచలేదు సుందరానికి. భారతి తనను పుస్తకములాగ చూస్తోందని తెలియలేదతనికి. ఏ విషయంలోనూ తొందరా ఆరాటంలేని భర్తను చూస్తే భారతికి తలమీద చన్నీళ్ళు క్రుమ్మరించినట్లయింది. పెళ్ళయ్యాక భారతిని తీసుకుని పాఛ్‌మాఢీ కొండలకు వెళ్ళివున్నాడు పదిరోజులపాటు సుందరం. భారతికి, పెళ్ళిలో లాంఛనంగా జరిగిన మిగతా వేడుకల్లాగే తోచింది తప్ప, ఆ ప్రేమయాత్రలో ఏమీ ప్రత్యేకత స్ఫురించలేదు. హోటల్లోకూడా సుందరం తెల్లవారి ఆరుగంటలకల్లా లేచిపోవడం, కాఫీత్రాగి పేపరు తీసుకుని ఎనిమిదయితే కాని అది పూర్తి చెయ్యకపోవడం చూసి భారతి విస్తుపోయింది. "హనీమూన్ సంగతి దేవుడెరుగు – హాలీడే మూడుకూడ రాదా ఈయనకు!" అనుకుంది.

భారతి మామగారికి మెడ్రాసులో మ్యూజిక్ రాళ్ళఫ్యాక్టరీవుంది. ఆయనకు ఖాళీ స్థలాలు చవుగ్గాకొని ధరలు పెరిగిన తరుణంలో అమ్మడం సరదా. దాంట్లో బాగా సంపాయించాడు. ఇళ్ళస్థలాల బేరంకన్నా సరదా అయిన విషయం ఆయనకు సంగీతం. వ్యాపారమంతా కొడుక్కు అప్పజెప్పి రెండేళ్ళయింది. యిప్పుడు వారానికి మూడుసార్లన్నా భార్యను తీసుకుని సంగీతకచ్చేరీలకెళ్ళడమే ఆయన వుద్యోగం. సినిమాపాటలంటే చెవికోసుకునే భారతి, అత్తవారింట్లో సిలోన్ ప్రోగ్రాం ట్యూన్ చెయ్యాలంటే సిగ్గుపడేది. మరీ పిచ్చెత్తిన రోజున గది తలుపులు వేసుకుని, ఇయర్‌ఫోను పెట్టుకుని ట్రాన్సిస్టర్‌తో 'చిత్రసీమ' వినేది. బాత్‌రూం సింగర్ భారతి స్నానంచేస్తూ వేన్నీళ్ళ హీటర్‌కు వెలుగుతున్న బల్బును చూస్తూ కసిగా "కహీ దీప్ జలే, కహీ దిల్" అనుకునేది. భారతి అత్తవారిల్లు అభిరామపురంలో క్రొత్తగా కట్టినది. అందంగా, వీలుగా కట్టబడిన ఆ యిల్లుచూసి భారతి ముచ్చటపడింది. ఇంటిముందు తివాచీ పరిచినట్లు చిన్నలాన్, దానికి అంచు అద్దినట్లు రంగురంగుల గులాబి మొక్కలు చూస్తే భారతికి బద్ధకమంతా వదిలిపోయి మట్టిలో చేతులు పెట్టాలనిపించింది. కాని తోటమాలి ఆమెకు అనుమతి యివ్వలేదు.

ప్రొద్దున కాఫీత్రాగ్గానే పేపరు చూడడం సుందరానికి ఎంత అలవాటో, భారతికి పక్షులను చూడ్డం అంత అలవాటు. పైభాగంలోవున్న తమ పడగ్గది ముందున్న చిన్న బాల్కనీలోకి పేముకుర్చీ లాక్కుని కూర్చుని, ఇంటిముందువైపు ఒకమూలగా వున్న 'గుల్‌మొహర్' చెట్టుమీద పిట్టను పరిశీలించడం సరదా భారతికి. "ఒక్కసారి, త్వరగా రండి, ఆ పిట్ట చూడండి. అచ్చం మైనాలాగే వుంది, మైనామాత్రం కాదు" అంటూ పిలిచేది సుందరాన్ని. అప్పటికే సుందరం బూట్లు తొడుక్కుంటూ "మధ్యాహ్నం పనుంది, భోజనానికి రాను. నాకోసం చూడకు" అనేసి వెళ్ళిపోయేవాడు, పక్షుల్లో ఏమాత్రం ఆసక్తి కనపరచకుండా.

"హు, వృత్తి, ఉద్యోగం, రూపాయలు, భోజనం, నిద్ర!" ఇంకేమీ అక్కర్లేదీ మగవాళ్ళకు అనుకుంది భారతి. ఏదో కొత్త ఆలోచన స్ఫురించిన భారతి కాయితాలు, కలం తీసుకుని గబగబా వ్రాయడం మొదలుపెట్టింది.

రెండు నెలల తర్వాత బొంబాయి

నుంచి వచ్చే ఒక ఆడవాళ్ళ పత్రికలో భారతివ్రాసిన "జీవిక, జీవితంకాదు" అనే వ్యాసం అచ్చయి వచ్చింది. అది చదివిన




సుందరం పకపక నవ్వాడు. నవ్వు వెనక కాస్తంత కనుబొమ్మలు ముడిపడ్డాయి. అది భారతి గమనించలేదు.

ఒకరోజు సాయంత్రం భారతి ఏదోపుస్తకంకోసం వెతుకుతుంటే "సౌందరనందం" చేతికితగిలింది. పుస్తకం విప్పి చూసింది. పుస్తకం మొదట్లోనే ఒక చిత్రముంది. "సుందరి తిలకం తీర్చి దిద్దుకుంటుంటే నందుడు అద్దం ఎత్తి పట్టుకున్నాడు." అది చూడగానే నవ్వువచ్చింది భారతికి. దాన్ని పుస్తకాన్నుండి వేరుచేసి, చక్కని ఫ్రేములో బిగించి బల్లమీద పెట్టింది, సుందరం నవ్వుతూ "గడియారాలు మమ్మల్ని ముందుకు తీసుకెళ్తుంటే, మీ స్త్రీలు మమ్మ

ల్నెందుకు వెనక్కి లాగుతారు? అంతలా భార్య సాన్నిధ్యానికి అలమటించిపోయిన నందుడు అన్నగారి ఆదేశంకాగానే సన్న్యాసుల్లో కలిసిపోయాడు. భారతీ, యీనాటి పురుషులలో నూటికి తొంభైమంది, ఆ రెండుపనులూ చెయ్యలేరు. ఎందుకు మీకీ వ్యర్థప్రయాస?" అన్నాడు.

సుందరం తెల్లవారి ఎనిమిదిన్నరకు యింట్లోంచి వెళ్తే రాత్రి తొమ్మిది గంటల గ్గాని యింటికి రావడంలేదు. భోజనంకూడ ఫ్యాక్టరీకే తెప్పించుకుంటున్నాడు. భారతి "ఏమిటీ యిల్లు పట్టకపోవడం?" అంటూ నిలదీసిం దొకనాడు. అర్థరాత్రి స్నానంచేసి తలదువ్వుకుంటున్న సుందరం "ఔను భారతీ, పని ఎక్కువైంది. క్రిందటి నెల్లో "హార్డువేరుషాపు" తెరిచామా? దాన్ని పెద్దదిచేసి వ్యవసాయ పరికరాలు, ఎరువులు అమ్మకం కూడ పెడదా మనుకుంటున్నాను. ఆ ఏజన్సీలకోసం తిరగాల్సి వస్తుంది. కాక పోతే సాయంత్రం క్లబ్బులో కాసేపు టెన్నిసో, ఇంకోనాడు రమ్మీనో ఆడితే కాస్త సేదతీరినట్లుంటుంది. దానికి నువ్వు పెద్దగా యిదికాబోకు. మర్చిపోయాను, రేపు సాయంత్రం పల్లావరం రోడ్డులో మన తోటకు వెళ్తున్నాను, వస్తావా నువ్వుకూడ" అన్నాడు, కాస్త అలకతీర్చే ధోరణిలో. మర్నాడు భర్తతోకలసి తోటకు వెళ్ళింది భారతి. సుందరంతండ్రి చవుగ్గా కొన్న స్థలాలలో అదొకటి. సుందరం తను చదివిన హార్టికల్చరు అనుభవంతో, ఆసక్తితో దాన్ని తోటగా మార్చాడు. ఆ తోటలో అడుగుపెట్టిన భారతి మనసుకు హాయనిపించింది. "ఆ తోటలో ఒక యిల్లు కట్టుకుని తను, తనభర్తా మాత్రం ..." భారతి ఆలోచనలు సాగిపోయాయి. ఏ కొరతలూ లేని యింట్లో పెరిగినా వయసు వచ్చేసరికి హాస్టలు జీవితానికి సరదాపడడం, అత్తపోరు, ఆడబిడ్డపోరు లేకపోయినా వేరింటి కాపరానికి ముచ్చటపడడం యీ రోజుల్లో అమ్మాయిలకు సహజమై పోయింది. "పదిపక్షు లెక్కడన్నా ఒక్క గూట్లో వుంటాయా? వాటికున్న యింగితం మనుష్యులకు లేదు. బెంగాలీకథల పుణ్యమా యని సమిష్టి కుటుంబాలంటే గౌరవం పెరుగుతోంది. యింటికి పెద్దకోడలు రింగు మాస్టరైతే ఎవరికి ఏమీ ఆక్షేపణ కనబడ్డం లేదు!" ... "ఏమిటో పెద్దగా ఆలోచిస్తున్నావు" అన్నాడు సుందరం. భారతి యీలోకంలోకి వచ్చింది. "యివి చూశావా యీ కొబ్బరి మొక్కలు కోయంబత్తూరు నించి తెప్పించాను. యీ తీగగులాబి కొడై కెనాల్‌నుంచి తెప్పించాను. యీ మామిడి అంట్లు చూశావా, యివి బంగినపల్లి, యివి హిమాయిద్దీనులు - నూజవీడునుంచి తెప్పించాను... సుందరం చెప్పుకు పోతున్నాడు. భారతి కేదో సందేహం మెదిలింది. "యివన్నీ దేనికోసం" అంటూ ఆపింది, భర్త ముఖంలోకి చూస్తూ. సుందరం ఉత్సాహంగా "మొన్న ఆ 'హార్డువేర్' షాపుకు 'సుందరం అండ్ కో' అని పేరు పెట్టామా! ఇంక నాలుగు నెలల్లో యీ తోటకు "భారతీ నర్సరీ" అని నామకరణం జరుగుతుంది. యీ నగరంలో వాళ్ళకు మేలుజాతి మొక్కలు..." భారతికి ఒళ్ళు దహించుకు పోయింది. ఎఱ్ఱపడిన కళ్ళతో "ఎంత సంఘసేవ!" అంది. ఇంకో నిముషం అక్కడ నిల్చోలేక పోయింది. పనివాళ్ళంతా తెల్లబోయారు. సుందరం ఏమి జరగనట్లుగా చెయ్యవలసిన పనులన్ని చెప్పి అరగంట తర్వాత కారులోకి వచ్చాడు. కారు ఓఫర్లాంగు వచ్చాక ఒకచెయ్యి భారతి భుజంమీద వేస్తూ "చూడు భారతీ నీకొక మాటచెప్తాను" భర్తృహరి చెప్పలేదు గాని, సంపాదనాకాంక్ష పురుషుని ప్రకృతిసిద్ధ గుణాల్లో ఒకటి. సజ్జనాళిసంగతి కాక పోవచ్చు గాని, మామూలు మనుషుల సంగతి నే చెప్పేది. సంపాదన సమర్థతతో కూడిన పని. మనుషుల్లో రచయితలు, శిల్పులు, చిత్రకారులు, గాయకులు, నాట్యాచార్లు, ఇంజనీర్లు, డాక్టర్లు, బాంబులు చేసేవాళ్ళు, బాక్టీరియాతోటి పోట్లాడేవాళ్ళు యింకా అనేకులు వున్నారు. కాని యివేమీ కాని మనుష్యులు చాలమంది వున్నారు. వాళ్ళకు డబ్బు చాలా ముఖ్యం. పురుషునికి సహజ సిద్ధమైన సంపాదనా కాంక్ష అవినీతి పాలు గాకుండా, అక్రమ మార్గాలు పట్టకుండా కాపాడడం ఆడవాళ్ళ బాధ్యతకాని, దాన్ని మొదలంటా నశింపచెయ్యాలను కోటం మీకు, మాకు, యిళ్ళకు, సంసారాలకు - దేనికీ మంచిదికాదు," అన్నాడు. భారతి ఆలోచనలో పడిపోయింది.



ఒకరాత్రి సుందరం నిద్రకుపక్రమిస్తూ "భారతీ! రేపు సాయింత్రం భారతీయ విద్యాకేంద్రంలో ఉషా దివాకర్ డాన్సుంది. నేవీమెస్‌లో "బ్లూబాల్" వుంది. దేని కెళ్ళడం యిష్టం నీకు?" అనడిగాడు. భారతి ఏమి ఆలోచించకుండానే "నాకు ఇండియన్ డాన్సంటేనే యిష్టం," అంది. మర్నాటి సాయింత్రం నాల్గింటికల్లా ఇంటికి వచ్చి భార్యతో "డాన్సు కెళ్దాం తయారుకా" అన్నాడు. ఇద్దరూ వెళ్ళారు. అక్కడ సుందరం స్నేహితుడు భాస్కర్ అతని భార్య పద్మినీ కనపడ్డారు. ఒక అరగంట డాన్సు చూశాక సుందరం భారతిచేతికి కారు తాళాలిస్తూ "నేనూ, భాస్కర్ 'నేవీబాల్' కెల్తాం. డ్రయివరును భోంచేసి బస్సులో తొమ్మిదింటికల్లా యిక్కడ రమ్మన్నాను. డాన్సయిపోగానే పద్మినిని వాళ్ళింటిదగ్గర దింపి నువ్వింటికెళ్లు. నేను, భాస్కర్ కారులో యింటికొస్తాను.'' అనేసి వెళ్ళిపోయాడు. భారతికి కోపం ఉడుకుమోత్తనము వచ్చింది. కానీ చేసే దేమిలేక వుండిపోయింది. ఇంటికివెళ్ళాక చీరైనా మార్చకుండా మంచంమీదపడి ఏడవడం మొదలుపెట్టింది. ఏడుపుతగ్గేలోపలే సుందరం వచ్చాడు. భార్యను చూస్తే నవ్వు వచ్చిందతనికి. "పిచ్చీ, లే, పద భోంచేద్దాం, ఆకలిగాలేదూ!'' అన్నాడు. నిజంగానే ఆకలి మండిపోతోంది భారతి బెట్టు చెయ్యకుండా డైనింగుహాలుకు నడిచింది. రెండు ముద్దలుతిని కాస్త ఆకలిమంట తగ్గాక "ఎందుకు నా పొడగిట్టడం లేదు మీకు?" అంది. సుందరం మాట్లాడలేదు. భారతి "కొన్నాళ్లు నేను మా వూరెల్తాను, మీరు హాయిగా వుండండి,'' అంది. భారతికి తండ్రిమాటలు గుర్తుకొచ్చాయి. పుట్టిళ్ళ దగ్గర నెలలతరబడి పనీపాటా లేకుండా వుండిపోయే ఆడవాళ్ళను విమర్శించే వాడాయన. కూతురు ఆదేపని చెయ్యబోతోంది! సుందరం నవ్వుతూ ''చూడు భారతీ నీ కెక్కడైనా తిరిగిరావాలనుంటే చెప్పు, వారం పదిరోజుల్లో తీరిక చేసుకుంటాను. ఎటైనా వెళ్ళవద్దాం. కాదు 'సెపరేట్ హాలిడే' కావాలనుకుంటే తప్పకుండా మీ వాళ్ళింటికి వెళ్ళిరా," అన్నాడు. "ఎంతటి ఔదార్యం!" అనుకుంది భారతి. "నన్నక్కడ దిగవిడిచి మీ రెందుకు వెళ్ళిపోయారు, విడివిడిగా తిరగాలనే ఆశ మీకేవుంది, నా కేమీలేదు." అంది. సుందరం ''నీకు నచ్చిన ప్రోగ్రాం వేరు, నాకు నచ్చింది వేరు. నావెంట నేను, లేక నావెంట నువ్వు రావలసిన అగత్యం నాకు బోధపడలేదు. ప్రేమకు నిదర్శనం దాస్యంకాదు, లాలసత్వం అంతకన్నాకాదు. అట్లా అయితే మనకు మళ్ళీ సతీసుమతులు, రుక్మాంగద మహారాజులు తారసిల్లుతారు. మనుష్యులు బాగుపడ్డారని విచారించకు! నా భార్య వ్యక్తిత్వంగల మనిషి అనుకుంటే నాకు గర్వంగా వుంటుంది. కనీసం నన్ను నేను అట్లా నమ్మించుకోవడంలో కాస్తంత తృప్తివుంటుంది!" అన్నాడు. భారతి బెదిరిపోయింది. భోంచేసి లేచి బేసిన్‌లో చెయ్యి కడుక్కుంటున్న భారతికి ప్రక్కనే వున్న కిటికిమీద దృష్టిపడింది. భార్య చెయ్యి పట్టుకుని జంటగా మెట్లెక్కుతున్నాడు సుందరం. భారతి "పూర్వం యిళ్ళకు కిటికీలు చిన్నగూడంత వుండేవి. ఇప్పుడా కిటికీ చూడండి ద్వారబంధమంత వుంది. అప్పుడు మగవాళ్ళకు యింట్లో ఉండాలనుండేది. ఇప్పటి మగవాళ్ళకు ఎంతకీ ఇంటి బైట కెళ్ళాలనే! ఆ కోరిక కిటికీ సైజులో బయటపడుతోంది.'' అంది. సుందరం భారతి వీపుమీద చరుస్తూ ''ఏం ఆ విధంగానే ఎందుకనుకోవాలి? పూర్వం పురుషునికి "స్త్రీ స్వేచ్ఛ'' అంటేనే భయంగా వుండేది. సూర్యకిరణాలు సోకకుండా దాచుకునేవాడు. ఇప్పటి పురుషులు "స్త్రీ స్వేచ్ఛ." దాని అవసరం గుర్తించారు. ఎటొచ్చీ దాన్ని వాడుకోడం తెలియదులేదు మీకు. మనదేశానికి స్వాతంత్ర్యం రావడం, స్త్రీలకు స్వేచ్ఛ లభించడం ఒక్కమాదిరిగానే వున్నాయి," అన్నాడు.

సుందరంత్వరగానే నిద్రపోయాడు. భారతికి నిద్రపట్టలేదు. ధర్మరావుగారి మాటలు గుర్తువచ్చాయి. తరచుగ''మన స్త్రీలకువంట, పిల్లలుతప్ప యింకేమి ఆలోచనలు వుండవు. తన మానసిక జీవితంలో పాలుపంచుకోలేని భార్యతోటి సహజీవనం, మధ్యతరగతి గృహస్థు అనుభవిస్తున్న నరకం," అనేవాడు. ఆ రోజుల్లో మగవాళ్ళకు, ఆడవాళ్ల గురించి మాట్లాడే టప్పుడు ''ఇంటలెక్చు



వల్ ఎంప్టీనెస్," అంటుండడం ఫ్యాషన్. ధర్మారావుగారి మాటవినే రఘురామయ్య భారతిని చదివించాడు.

భారతి ఆలోచనలో పడింది. అందులో కొంత ఆత్మ విమర్శకూడాసాగింది.

"చదువు నాకేమి ఒరగబెట్టింది? నాన్న చదివించినన్నాళ్ళు చదివాను. మాన్పించగానే మానేశాను. సంబంధం కుదిర్చి పెళ్ళి చేస్తే చేసుకున్నాను. మంచిరోజు చూసి, అత్తవారింటి కెళ్ళమంటే వెళ్ళాను. చదువు వల్ల నా బుద్ధికాస్త పదునెక్కిందేమో తాని వ్యక్తిత్వం ఏం కలిగింది? దానివల్ల నాకెంతసుఖం, నా భర్త కెంత సుఖం కలిగాయి? తెల్లవారిలేస్తే భర్తతో వాదులాడ్డానికి తప్పించి మరెందుకూ పనికిరావడం లేదీ "వ్యక్తిత్వం" అనుకున్నది భారతి.

ఆమె హృదయం ఏదో ఘోషిస్తున్నట్టుగా తోచింది.

"ధర్మారావుగారూ! మీరు పొరపడ్డారు. ఈ దేశంలో, ఏసమస్యా అంత తేలిగ్గా తేలేదికాదు. అదే సమస్య మరోరంగులో ప్రత్యేక మవుతుంది. ఒక్కొక్కటీ ఒక్కొక్క ఊసరవెల్లి ధర్మారావుగారూ! ఊసరవెల్లి!" అన్నమాటలు హృదయములోంచివచ్చి, ఆమె చెవిలో పడినై. ★

